# ఎవరు వీరు?

సమాజ శాస్త్రాలకు చెందినవాళ్ళం క్లయింటేల్ అనే మాటను తరచు వాడుతున్నాం. క్లయింటేల్ అనే మాటను తెలుగులో ఖాతాదారులు అని అనవచ్చునేమో. ఫలానా వృత్తికీ, వ్యాపారానికీ, కళలకూ, విద్యకూ, విశ్వవిద్యాలయాలకూ, గ్రంథాలయాలకూ, కట్టకడపటికి విప్లవానికి కూడా నీ ఖాతాదారులు ఎవరు? అనేది మనం ముందుగా ఆలోచించుకోవాలి అని అంటూ ఉంటారు సమాజ శాస్త్రాల బుద్ధిజీవులు. నేను వృత్తిరీత్యా ఆ కోవలోనివాణ్ణే.

'హైదరాబాదు మునిసిపల్ కార్పొరేషన్ పరిధుల్లోని గ్రంథాలయాల ఖాతాదారులు: ఒక సామాజిక విశ్లేషణ' అనే అంశంమీద ఆ మధ్య ఒక రిసర్చిపేపరు రాయవలసి వచ్చింది. మద్రాసులో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో చదవవలసి వచ్చింది. ఆ రోజుల్లోనే నాకు సురేఖా, మోహన్ పరిచయమయ్యారు. నిజానికి రిసర్చి పేపరు రాయాలనే జిజ్ఞాసకు పరోక్ష ప్రేరణ సురేఖది. ప్రత్యక్ష సహాయం లభించింది మోహన్ నుంచి. కాన్ఫరెన్స్‌లో రిసర్చి పేపరును గ్రంథాలయ విజ్ఞానులంతా తెగ మెచ్చుకున్నారు. ఈ రంగంలో కృషి మరింత జరగాలన్నారు. నా ప్రతిష్ఠ కూడా పెరిగిపోయింది. కానీ నా పరిశోధక ఉత్సాహం ఎందుకో దెబ్బతిందనే చెప్పాలి. సురేఖా, మోహన్ ఏ రకం ఖాతాదారులో నేనిప్పటికీ తేల్చుకోలేకుండా ఉన్నాను. కథ విని, మీరైనా చెప్పండి.

సురేఖ మా పక్కింటి పెద్ద కంట్రాక్టరుగారి చిన్న కూతురు. కంట్రాక్టరుగారు బంజారాహిల్సులో పెద్ద ఇల్లు కట్టుకుంటున్నారు. శ్రీనగర్ కాలనీలో తాత్కాలిక విడిది. మా పొరుగున చేరి ఆరు నెలలైంది. ఆయన కుటుంబం చేరీ చేరగానే వాళ్ళతో మాకేదో బీరకాయ పీచు బంధుత్వాన్ని మా ఆవిడ కనిపెట్టి మురిసిపోయింది. నన్ను మురిపించాలని తంటాలు పడింది. సమాజంలో మనకు భద్రత లేదనటానికి కుల బంధుత్వాలకంటే నిదర్శనాలు లేవని నా నమ్మకం. పోనీండి, నేను ఆ రకం బంధుత్వాలకు మురిసిపోలేను. మురిసిపోలేనని మా ఆవిడతో చెప్పినా లాభం లేదు. కాబట్టి ఆమెతో పేచీ పెట్టుకోలేదు.

నేను అచ్చంగా ముచ్చట పడింది సురేఖను చూసి, బి.కాం., పూర్తి చేసుకుని పెళ్ళికోసం ఎదురు చూస్తున్న సురేఖను చూసి. పెళ్ళికోసం ఎదురు చూస్తున్నా, ఆ పిల్ల జ్ఞాన దాహం చూసి – పుస్తకాల్ని తెగ చదవడం చూసి. మా యూనివర్శిటీ లైబ్రరీలో అట్లా చదివే డజనుమంది విద్యార్థులనూ, అరడజను టీచర్లనూ ఇరవై ఏళ్ళుగా నేను చూడలేదు. ఏ పుస్తకాలు చదివితేనేం? ఏ పరీక్షలకోసమూ కాకపోతేనేం? ఏ పరిశోధనకోసమూ చదవక పోతేనేం? నా దగ్గరున్న తెలుగు నవలల్నీ, కథా సంకలనాలనూ, కొన్ని ఛేస్, న్యూవేవ్ ఇంగ్లీషు నవలల్నీ రోజు కొకటి చొప్పున చదివి జాగ్రత్తగా తిరిగి ఇచ్చింది. అట్టలు చించకుండా ఇచ్చింది. పుస్తకాల్లోని నచ్చిన కాగితాల్ని చించి దాచుకోకుండా తిరిగి ఇచ్చింది. సురేఖ వాటిని నిజంగానే చదివింది. చదివిందనటానికి గుర్తుగా ఏ ఆదివారమో నాతో చర్చకు దిగేది. ప్రేమ, పెళ్ళి సమస్యలున్న నవలమీద అయితే సురేఖ ఆ చర్చ ఇంకా బాగా చేసేది – ఉత్సాహంతో, తన సమస్యనే చర్చి స్తున్నామన్నంత ఇదిగా చర్చించేది.

అట్లా ఒక ఆదివారం ఆ మధ్యనే సినిమాగా వచ్చిన ఒక తెలుగు నవలను గురించి చర్చించుకుంటున్నాం నేనూ, సురేఖ. అప్పుడొచ్చాడు మోహన్, చేతిలో ఒకటి రెండు పుస్తకాలు పట్టుకొని. మోహన్‌ను సురేఖకు పరిచయం చేశాను – లోచన ప్రింటర్స్‌లో ఒక ప్రూపురీడరనీ, ఎం.ఎ., చదువుకున్నాడనీ, కథలు రాస్తాడనీ. ఒక రచయితతో తొలిసారి ముఖ పరిచయమేమో సురేఖ చాలా ఆనందపడింది. కాన్వెంట్ ఇంగ్లీషు మర్యాద భాషలో ఆ ఆనందాన్ని వెల్లడించింది కూడా. మోహన్ నవ్వి ఊరుకున్నాడు. సురేఖను గురించి మోహన్‌కు గొప్పగా పరిచయం చేశాను. సురేఖ మూలంగా ఒక రిసర్చి పేపరు రాయాలనే నిర్ణయానికి వచ్చినట్లు కూడా చెప్పాను. ఫిక్షన్ క్లయింట్ సురేఖ అన్నాను గర్వంగా. అప్పుడన్నాడు మోహన్:

"అట్లా అయితే నా కథలు చదివి అభిప్రాయం చెప్పమనండి. నా కథల క్లయింటేల్ గురించి నాకు అభిప్రాయాలు ఏర్పడతాయి. అవి నా రచనా సంస్కారం పెంచుకోవటానికి తోడ్పడవచ్చు."

"మీ కథలు ఒకటి రెండు చదివినట్లు గుర్తు" అంది సురేఖ గుర్తు చేసుకోటానికి ప్రయత్నిస్తూ.

"ఇప్పుడు చదవండి – ఈ పదీ ఒక్కమారుగా" అంటూ మోహన్ తాను తెచ్చిన తన కథల సంకలనాల్లో ఒకటి నాకూ, మరొకటి సురేఖకూ కాంప్లిమెంటరీ కాపీలుగా ఇచ్చాడు.

"ఇన్నాళ్ళూ నాతో అనలేదే పుస్తకం బయటికి వస్తున్నట్లు?" అని మోహన్‌తో నిష్ఠూరంగా అన్నాను.

"మొదటి అభినందన ప్రతి మీదేగా?" అని నవ్వాడు మోహన్.

"అయితే నేను శ్రీ, సురేఖ చుక్క అన్నమాట" అన్నాను.

"అదేమిటి" అంది సురేఖ.

"అది పల్లెటూరి బడుల సంగతి లెండి. స్కూలుకు మొదట వచ్చిన విద్యార్థో విద్యార్థినో శ్రీ. తర్వాత వచ్చిన రెండో స్టూడెంట్ చుక్క. మీరు చిన్నప్పటి నుంచి హైదరాబాదులోనే పెరిగినట్లుంది" అన్నాడు మోహన్.

సురేఖ సమాధానంగా నవ్వింది. సినిమాగా వచ్చిన నవలమీదికి మళ్ళీ చర్చను మళ్ళించింది. మోహన్ అభిప్రాయమడిగింది.

"ఆ నవల మిమ్మల్ని అంతగా ఆకర్షించటానికి కారణం ముందు చెప్పండి?" అన్నాడు మోహన్.

సురేఖ తికమకపడింది.

"సరేలెండి. మరెప్పుడైనా తీరిగ్గా చర్చిద్దాం. మళ్లీ ఆదివారం వస్తానులెండి" అంటూ మోహన్ లేచాడు.

నేను నా రిసర్చి పేపరు సంగతి ప్రస్తావిస్తూ అతనికి అందుబాటులో ఉన్న లైబ్రరీల నుంచి నాకు కావలసిన సమాచారాన్ని సేకరించి ఇవ్వమని అడిగాను.

"ఏ పద్ధతుల్లో సేకరించాలో చెప్పండి, తప్పకుండా పట్టుకొస్తాను" అన్నాడు.

"రేపు సాయంత్రం యూనివర్శిటీ లైబ్రరీకి వస్తావు కదా, అపుడు చెబుతాను" అన్నాను.

మోహన్ వెళ్ళిపోయాక సురేఖ "ఈవాళే మోహన్‌గారి కథల్ని చదువుతాను" అంది.

మరో ఆదివారం... మరో ఆదివారం... మరో ఆదివారం. రెండు మూడు నెలలు గడిచాయి. సురేఖ, మోహన్ మా ఇంట్లో కలిసినప్పుడల్లా ఏదో ఒక చర్చకు దిగుతున్నారు. మోహన్ కథల మీద సురేఖ ఒక్కమాట అన్నట్లు జ్ఞాపకం లేదు. మోహన్ తన కథల సంగతి సురేఖతో ప్రస్తావించలేదు. అవి పల్లెటూరి రైతుల కథలు. ఆ జీవితం తెలియక సురేఖ చర్చించటం మానుకుందేమో అనుకున్నా. కానీ మోహన్ కోసం సురేఖ ఆదివారం ఎదురు చూస్తూ ఉందని మాత్రం గ్రహించాను. సురేఖ మాట్లాడుతున్నపుడు మోహన్ ఆరాధన నిండిన కళ్ళతో గమనించడం చూశాను. కాస్త హృదయ సౌకుమార్యమున్న యువతీ యువకులు ఎక్కువగా కళ్ళతో మాట్లాడుకుంటారని నా పిచ్చినమ్మకం. వాళ్ళిద్దరిదీ నిస్సందేహంగా ప్రేమే. వాళ్ళిద్దరూ దంపతులైతే బావుంటుందని కూడా అనుకున్నాను. అప్పుడెప్పుడో ఒకరోజు మా ఆవిడ సురేఖ పెళ్ళి సమస్యను నాతో ప్రస్తావించినట్లు గుర్తు.

"మూడు లక్షలు ఇవ్వటానికి పూనుకున్నా, మొగుడు దొరక్కపోవటమేమిటి?" అని నాతో మా ఆవిడ అంది. మాకు ఆడపిల్లలు లేకపోవడం వల్ల కావచ్చు. నాకా సమస్యలు పెద్దగా తెలీక పోవడం వల్ల కావచ్చు "ఎవరికీ? ఏం తెగులు?" అన్నాను. మా ఆవిడ ఏదో సమాజ పురాణాలూ, కులగాథలూ, ధరవరలూ విన్పించింది. బంజారాహిల్సులో పదిహేను లక్షలతో కట్టుకుంటూన్న కంట్రాక్టరు సమస్యలు విన్పించింది.

నాకు చిరాకేసి "ఏ ఇంజనీరో, డాక్టరో, ఐ.ఏ.ఎస్సో కావాలనుకుంటే తప్ప సురేఖ లాంటి మంచి పిల్లకు మొగుడు దొరక్కపోదు" అని అన్నాను.

మా భార్యభర్తల సంవాదం జ్ఞాపకం వచ్చినప్పుడల్లా అన్పించేది, మోహన్ విషయం కంట్రాక్టరు గారితో చెబుదామా అని.

మా ఆవిడతో అంటే "నయం! కులగోత్రాలు, డబ్బు దస్కం పట్టించుకోకుండా కట్టబెట్టాలని అనుకోడానికి కంట్రాక్టరుగారు మీలాంటి వాళ్ళు కాదు" అంది. నోరు మూసుకున్నాను.

ఆ రోజు మోహన్ వచ్చీ రాగానే సురేఖ అడిగింది:

"మీరెప్పుడూ ఒక్క ప్రేమకథైనా రాయలేదా?" అని.

ఎదురు చూడని ప్రశ్నేమో మోహన్ కాసేపు ఇబ్బంది పడినట్లుంది. నెమ్మదిగా అన్నాడు:

"ఇంతవరకు రాయలేదు. ఇంతవరకు నేను రాసిందే ఇరవై కథలు. రాయకూడదనేది నా మతం కాదు. ప్రేమ విషయంలో గొప్ప సంస్కారమున్న జంటలు నా అనుభవంలోకి వస్తే తప్పక రాస్తాను."

"గొప్ప సంస్కారమంటే?" సురేఖ సవాలు విసిరింది.

"అంటే ఒకరి అభిప్రాయాన్ని ఒకరు మన్నించగల సంస్కారం. ఒకరి లోపాన్ని ఒకరు సరిదిద్దగల సంస్కారం. కులాలకూ, మతాలకూ, కలతలకూ, రాజకీయాలకూ సంబంధించిన ఇప్పటి సంస్కారాన్ని అధిగమించటానికి ప్రయత్నించగల సంస్కారం."

సురేఖ కళ్ళు చేసుకొని విని మరొక ఇబ్బందికరమైన ప్రశ్న వేసింది:

"ఈ సంస్కారానికి డబ్బుతో అవసరం లేదా?" అని.

"తప్పకుండా అవసరముంది. చాలా చాలా డబ్బుతో అవసరం లేదు."

మోహన్ సమాధానంలోని 'చాలా చాలా' అనే మాటలు నన్ను ఆశ్చర్యంలో ముంచాయి. సురేఖ మరి మాట్లాడలేదు – ఏమనుకుందో గానీ. వాతావరణంలోని సీరియస్‌నెస్‌ను తొలగించటానికి నేను నవ్వుతూ అన్నాను, మోహన్‌తో:

"నీలాంటివాళ్ళు రాసేవి సుత్తి కథలని మా ఆవిడ, మా పెద్దబ్బాయిలాంటి వాళ్ళు అంటూంటే విన్నాను. కాస్త మంచి కథలు రాయవయ్యా!"

"అన్యాయం, మోహన్ గారివి సుత్తికథలు కావు, కానీ ప్రేమ కథ రాస్తే ఆయన ఎట్లా రాస్తారో చూద్దామని" అంది సురేఖ.

మోహన్ కథల మీద ఇన్నాళ్ళకు ఒక్క మాట మాట్లాడింది సురేఖ.

"సురేఖ కోసమైనా రాయి" అన్నాను నేను ఉడికిద్దామని.

"సమయం వస్తే తప్పకుండా రాస్తాను" అన్నాడు మోహన్.

ఇది జరిగాక రెండు మూడు ఆదివారాలేమో మోహన్ మా ఇంటికి వచ్చాడు. తర్వాత నెల రోజులు అజా పజా లేడు. సురేఖ మా యింటికి అపుడపుడూ వస్తూనే వుంది కానీ, ఇంతకుముందు ఉత్సాహం లేదు. నా అనుమానం వాళ్ళిద్దరి మధ్యా ఏదో జరిగిందని. మోహన్ పనిచేసే ప్రెస్సులో నా పుస్తకం ఒకటి అచ్చు వేశాను కాబట్టి, నాకు వాళ్ళు తెలుసు. వాళ్ళకు ఫోను చేశాను. ఆ ప్రెస్సులో ఉద్యోగం మానుకొని మరేదో వారపత్రికలో చేరాడని వాళ్ళు చెప్పారు. ఇది జరిగిన వారం రోజుల్లో పోస్టులో నా పేర ఒక మాసపత్రిక వచ్చింది. ఒక కార్డు కూడా. 'కథ చదివి సురేఖగారిని చదవమనండి. ఆమె రుణం తీర్చుకున్నాను. నేను పెళ్ళి చేసుకున్నాను. వివరాలు సమక్షంలో" అని నాలుగే వాక్యాలు ఆ కార్డులో.

పెళ్ళిని ఇంత మామూలుగా, చాలా సొంత విషయంగా తీసుకున్న యువకుణ్ణి నేనంత వరకు చూళ్ళేదు. ఆ విషయం, ముందు నాతో తెల్పనందుకు కొంత బాధ పడ్డాను కూడా. పత్రికలోని అతని కథ "ప్రేమ కంపోజింగు" చదివాను. ప్రూఫురీడరుగా ఉంటున్న ఒక యువకుడు, కంపోజిటరుగా ఉన్న ఒక అమ్మాయి జీవితాన్ని చూసి, భావాలను వినీ, ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం కథ. వాస్తవ సమస్యల్ని కథలోని వాళ్ళిద్దరూ అట్లా చర్చించుకోవడం చూసి దిమ్మదిరిగి పోయాను. అద్భుతంగా రాశాడు. అంతకంటే చెప్పడం నాకు చేతకాదు.

సురేఖను కథ చదవమన్నాడు కదా అని పిలిచి పత్రిక ఇచ్చాను. అతని పెళ్ళి విషయం చెబుదామా అనిపించింది. ఈ తరం యువతీ యువకులు మా తరం కంటే మరింత లోతైనవాళ్ళు. తమకు ఏం కావాలో వాటిని ఎట్లా సంపాదించుకోవాలో స్పష్టంగా తెలుసునో తెలియదో కానీ, మరిన్ని విషయాలు ఆలోచించగలిగిన వాళ్ళు. ఎందుకు లెమ్మని చెప్పలేదు.

మరుసటి రోజు పత్రికను సురేఖ తిరిగి ఇస్తున్నపుడు మాత్రం అడిగాను:

"నువ్వడిగితేనే ప్రేమకథ రాశాడు, చూడు. కథ ఎట్లా ఉంది?" అని.

ఒకే ఒక్కమాట "ప్రూఫురీడర్లూ కంపోజిటర్ల ప్రేమలోనే గొప్ప సంస్కారం ఉంటుందని అనుకున్నాడేమో!"

మళ్ళీ మాట్లాడడానికి అవకాశం ఇవ్వకుండా సురేఖ ఆ మాట అని వెళ్ళిపోయింది. సురేఖ మాటలో వ్యంగ్యముందో, కసి ఉందో, తిరస్కారముందో, గర్వభంగముందో నా కంతు పట్టలేదు. నా రిసర్చి పేపరు, మద్రాసు ప్రయాణం గొడవల్లో నేనేమీ పట్టించుకోలేక పోయాను. మద్రాసు నుంచి వస్తూనే నాకు తెలిసిన విషయాలు రెండు: సురేఖ పెళ్ళి నిశ్చయమైంది. వరుడు ఇంజనీరు. కట్నం అయిదు లక్షలు.

మోహన్ భార్యా సమేతంగా మా యింటికి వచ్చి వెళ్లాడట. 'మోహన్ భార్య కంపోజిటరు అయితేనేం, చూడముచ్చటగా ఉందండి ఆ జంట' అని మా ఆవిడ అప్పటి కప్పటి అభిమాన వ్యాఖ్య.

ఇంకో కొసమెరుపు మాట అంది మా ఆవిడ:

"సురేఖ మోహన్ ప్రేమను తిరస్కరించిందట. సురేఖ చెప్పింది నాతో."

ఇప్పుడు చెప్పండి సురేఖ, మోహన్ ఏ రకం క్లైయింటేల్ – అదే ఏ రకం ఖాతాదారులు జీవితంలో? ప్రేమలో?

✦

మార్చి *1986* – జ్యోతి మాసపత్రిక